క్లుప్తంగా

ముమ్మరంగా నర్సరీ పనులు



పనులను పరిశీలిస్తున్న టీఏ గణేశ్

చిలప్‌చెడ్(నర్సాపూర్): నర్సరీ పనులు ముమ్మరం చేశామని, వర్షకాలం సీజన్ వచ్చేసరికి మొక్కలు సిద్ధం చేసేలా ప్రణాళిక చేపట్టామని పంచాయతీ కార్యదర్శి తిరుపతి అన్నారు. సోమవారం మండల పరిధిలోని చిట్కుల్ గ్రామంలో జరుగుతున్న నర్సరీ పనులను కార్యదర్శి తిరుపతి, టీఏ గణేశ్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన నర్సరీలో 16 వేల మొక్కల తయారీకి పాలిథిన్ కవర్లలో మట్టి నింపించామన్నారు. నర్సరీ పనులు వేగంగా కొనసాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోపాల్‌రెడ్డి ఉన్నారు.

రోడ్డుకు మరమ్మతులు



కొనసాగుతున్న పనులు

శివ్వంపేట(నర్సాపూర్): నర్సాపూర్ – తూప్రాన్ ప్రధాన హైవే పలుచోట్ల గుంతల మయంగా మారిన విషయం గురించి 'సాక్షి' దినపత్రికలో పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. అందుకు సంబంధిత అధికారులు స్పందించి గుంతలను పూడ్చి వేయడంతో పాటు బీటీ రోడ్డు వేసే పనుల్లో నిమగ్నయ్యారు. గుంతలు పూడ్చి రోడ్డు మరమ్మతులు చేస్తుండడంపై వాహనదారులు సంతోషం వ్యక్తం చేశారు.

సాక్షి ఎఫెక్ట్

బీఆర్ఎస్ నాయకుల పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న నాయకులు

కౌడిపల్లి(నర్సాపూర్): బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా సునీతారెడ్డి గెలుపొందడంతో మండలంలోని పలు గ్రామాల నాయకులు తునికి నల్లపోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ డైరెక్టర్ అంజాగౌడ్, మాజీ ఎంపీటీసీ శంకర్‌గౌడ్, కొండల్‌రావు, మల్లేశ్‌యాదవ్, రామాంజనేయులు తదితరులు నల్లపోచమ్మకు పూజలు చేశారు. సునీతారెడ్డి గెలుపుకోసం కృషి చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయాల్లో భక్తుల సందడి



కోనేటిలో దీపాలు వదులుతున్న మహిళలు

పెద్దశంకరంపేట(మెదక్): కార్తీకమాసం సందర్భంగా ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. మండల పరిధిలోని కొప్పోల్ ఉమాసంగమేశ్వర దేవాలయంతో పాటు గురుపాదగుట్ట శివాలయం, రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో మహిళలు కార్తీక దీపాలు వెలిగించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల కోసం ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఆటో బోల్తా

చిన్నశంకరంపేట(మెదక్): మోడల్ స్కూల్ దారిలో గుర్తు తెలియని ఆటో బోల్తాపడిన సంఘటన మండల కేంద్రం చిన్నశంకరంపేటలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మోడల్ స్కూల్ దారిలోకి వచ్చిన ఆటో రోడ్డు కిందకు పడిపోవడంతో బోల్తాపడింది. అర్ధ రాత్రి సమయంలో సంఘటన జరిగినట్లు కాలనీ వాసులు తెలిపారు. ఇదే సమయంలో జేసీబీ నిర్వాహకుల బైక్ కన్పించకుండా పోవడం, ఆటో కోసం సోమవారం రాత్రి వరకు కూడా ఎవరు రాకపోవడంతో అనుమానాలు నెలకొన్నాయి.

ప్రాణాంతకం.. ఆ వంతెనలు

- స్పీడ్ బ్రేకర్లు లేక ప్రమాదాలు
- పట్టించుకోని హైవే అధికారులు
- ఇటీవల రెండు నిండు ప్రాణాలు బలి..

అల్లాదుర్గం(మెదక్): 161 హైవేలోని వంతెనలు ప్రాణాంతకంగా మారాయి. బ్రిడ్జిల కింద నుంచి ప్రయాణం అంటే నరకప్రాయంగా తయారైంది. ఆటు వైపు నుంచి వేగంగా వచ్చే వాహనాలు ఢీ కొనడంతో తరచు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయకపోవడంతో వాహనాలు నిండు ప్రాణాలను బలి తీసుకుంటున్నాయి. ఎన్ని ప్రమాదాలు జరిగినా, ఎన్ని ప్రాణాలు పోయినా హైవే అధికారులు, కాంట్రాక్టర్ మాత్రం పట్టించుకోవడం లేదని వాహనదారులు వాపోతున్నారు. ఇటీవల ప్రమాదంలో ఇద్దరు తమ ప్రాణాలు పోగొట్టుకున్నారని, అధికారులు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

అల్లాదుర్గం మండలం రాంపూర్ బ్రిడ్జి వద్ద ఆర్టీసీ బస్సు అతివేగంగా వచ్చి బైక్‌ను ఢీ కొనడంతో సీతానగర్ గ్రామానికి చెందిన ఇద్దరు బాలురు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనతో ఆగ్రహించిన గ్రామస్తులు, ఆర్టీసీ బస్సు, హైవే పెట్రోలింగ్ వాహనాన్ని ధ్వంసం చేశారు. జాతీయ రహదారిపై గంటల తరబడి రాస్తారోకో చేశారు. రెండు నిండు ప్రాణాలు బలి, ఇప్పటికైనా హైవే అధికారులు స్పందించాలని గ్రామస్తులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.



చిల్వెర ఐబీ చౌరస్తా బ్రిడ్జి వద్ద రోడ్డుపై కానరాని స్పీడ్ బ్రేకర్లు

అల్లాదుర్గం 161 జాతీయ రహదారి వెంబడి గడిపెద్దాపూర్, చిల్వెర ఐబీ చౌరస్తా, చిల్వెర, అల్లాదుర్గం, రాంపూర్, ముస్లాపూర్, ముప్పారం గ్రామాల వద్ద బ్రిడ్జిలు నిర్మించారు. అయితే ఆ బ్రిడ్జిలు పైనా, రోడ్డు మీద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయలేదు. దీంతో వాహనాలు వేగంగా రాకపోకలు సాగిస్తున్నాయి. ఫలితంగా ప్రమాదాలు నిత్యకృత్యం అయ్యాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల గడిపెద్దాపూర్ వద్ద ఆర్టీసీ బస్సు బైక్ ఢీ కొని ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇప్పటికైనా ప్రతి బ్రిడ్జి వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



సీతానగర్ గ్రామస్తులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

సునీతారెడ్డికి శుభాకాంక్షల వెల్లువ



సునీతారెడ్డిని సన్మానిస్తున్న ప్రెస్‌క్లబ్ సభ్యులు

శివ్వంపేట(నర్సాపూర్): నర్సాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా విజయం సాధించిన సునీతారెడ్డికి సోమవారం పలువురు నేతలు శుభాకాంక్షలు తెలిపారు. మండల పరిధిలోని గోమారంలోని ఆమె నివాసంలో జెడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా ఆధ్వర్యంలో పలువురు బీఆర్ఎస్ శ్రేణులు శాలువాతో సన్మానించారు. సర్పంచ్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు లావణ్యారెడ్డి, ఎంపీటీసీ నర్సింహారెడ్డి, ఉప సర్పంచ్ శ్రీనివాస్‌లు విజయం సాధించిన ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. నియోజకవర్గంలోని పలువురు నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తన విజయం కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో సన్మానం

మండల కేంద్రం శివ్వంపేట మండల ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సునీతారెడ్డిని సోమవారం సన్మానించారు. గోమారంలోని అమె స్వగ్రామంలో విలేకరులు కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. వివిధ పత్రికల్లో పనిచేస్తున్న విలేఖర్ల సమస్యలు పరిష్కరించడంలో తనవంతు కృషి చేస్తానని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు బి. రవి, గౌరవ అధ్యక్షులు మల్లేష్, అబ్దుల్ అజీజ్, ఉపాధ్యాక్షులు నటరాజ్‌గౌడ్, రాజు ప్రధాన కార్యదర్శి పోచగౌడ్, సలహాదారుడు బాలేశ్, కోశాధికారి మహేశ్‌గౌడ్, సంయుక్త కార్యదర్శి కిషోర్‌గౌడ్, కార్యవర్గ సభ్యులు సురేశ్, ప్రకాశ్, వెంకట్‌స్వామి, విరేశ్ ఉన్నారు.



సునీతారెడ్డిని సన్మానిస్తున్న జెడ్పీటీసీ మహేశ్‌గుప్తా

మండలంలో కాంగ్రెస్‌కు పూర్వవైభవం

కౌల్దారం(నర్సాపూర్): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం మంచి పరిణామమని, రాబోయే రోజుల్లో మండలంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం రానుందని ఆ పార్టీ మండలాధ్యక్షుడు మల్లేశం గౌడ్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ.. తమ అభ్యర్థి రాజిరెడ్డి ఓటమిపాలైన ప్రజలకు పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను ప్రజలకు అందించేందుకు రాజిరెడ్డి నేతృత్వంలో మేము పనిచేస్తామన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం మండల వ్యాప్తంగా అత్యధిక స్థాయిలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలను గెలిపించుకునేందుకు పూర్తి సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రజలు తమ అభ్యర్థికి ఇచ్చిన ఆదరణకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మహేశ్వర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు గోవర్దన్, నాయకులు శేఖర్, శ్రీకాంత్, కిష్టయ్య, జయరాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా గుంత

కౌల్దారం(నర్సాపూర్): మండలంలోని మెదక్ – జోగిపేట ప్రధాన రహదారి చిన్నఘనాపూర్ గ్రామ శివారులోని బావి, కల్వర్టుకు మధ్యలో ఉన్న రహదారిపై తారు లేచిపోయి పెద్ద గుంత ఏర్పడింది. అటువైపుగా రాకపోకలు సాగించే వాహనదారులు, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఆర్అండ్ బీ అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని ప్రయాణికులు కోరారు.



రోడ్డు మధ్యలో గుంత

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రామాయంపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ అహమ్మద్ మోహినుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం... నార్సింగి వడ్డెర కాలనీకి చెందిన గండికోట యాదగిరి (45) బైక్‌పై సోమవారం రాత్రి నార్సింగి వైపు వస్తుండగా, గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో అతని తలపై నుంచి లారీ టైర్లు వెళ్లడంతో తల చిద్రమై రోడ్డుకు అతుక్కుపోయింది. ఈ మేరకు నార్సింగి ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

చేగుంట(తూప్రాన్): దహనం చేసిన గుర్తు తెలియని యువతి మృతదేహాన్ని సోమవారం మధ్యాహ్నం వడియారం శివారులో గుర్తించినట్లు ఎస్ఐ హరీశ్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. వడియారం శివారులోని 44వ నంబర్ జాతీయ రహదారి రెండో బ్రిడ్జి కింద మృతదేహం ఉన్నట్లు గ్రామస్తుల సమాచారం అందించగా పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పంచనామా నిర్వహించారు. సుమారు 20 నుంచి 30 ఏళ్ల లోపు ఉన్న యువతిని గుర్తు తెలియని వ్యక్తులు చంపి ఇక్కడకు తీసుకొచ్చి దహనం చేసి ఉంటారని అనుమానిస్తున్నామన్నారు. మృతురాలు ఆరెంజ్ కలర్ టాప్‌తో పాటు ఎరుపు రంగు లెగిన్ ధరించి ఉన్నట్లు కాలికి నలుపురంగు దారం కట్టుకొని ఉందని చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృత దేహాన్ని రామాయంపేట మార్చురీకి తరళించినట్లు మృతురాలి బంధువులు ఎవరైనా ఉంటే చేగుంట పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు.

కొత్త ప్రభాకర్‌రెడ్డిని కలిసిన ఎంపీటీసీలు



ప్రసాదం అందిస్తున్న ఎంపీపీ శ్రీనివాస్

చేగుంట(తూప్రాన్): దుబ్బాక ఎమ్మెల్యేగా గెలుపొందిన కొత్త ప్రభాకర్‌రెడ్డిని ఎంపీపీ మాసుల శ్రీనివాస్ ఎంపీటీసీలతో దుబ్బాకలో మర్యాద పూర్వకంగా కలిసినట్లు తెలిపారు. ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలిచిన ప్రభాకర్‌రెడ్డిని కలిసి తిరుపతి ప్రసాదం అందించారు. ప్రభాకర్‌రెడ్డిని కలిసిన వారిలో ఎంపీటీసీలు గణేశ్, నవీన్, నాయకులు రఘురాంలు, ఆనందం, మహేశ్, కృష్ణ తదితరులు ఉన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

జగదేవ్‌పూర్(గజ్వేల్): కొండపోచమ్మ వార్షికోత్సవ ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయంలోని శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం పూర్ణాహుతి నిర్వహించారు. అలాగే అన్నదానం కార్యక్రమం చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ మోహన్‌రెడ్డి, సిబ్బంది వెంకట్‌రెడ్డి, కనకయ్య, యాదగిరి, లక్ష్మణ్, చందు, చిన్నా, హరి, సుధాకర్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

గెలుపునకు కృషి చేసిన అందరికీ కృతజ్ఞతలు

టేక్మాల్(మెదక్): కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేసిన ప్రతి నాయకుడికి, కార్యకర్తకు, ఓట్లు వేసిన అందరికి కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నిమ్మ రమేశ్ కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం మండల కేంద్రం టేక్మాల్‌లో ఆయన మాట్లాడుతూ... అందోల్‌లో ప్రజలంతా ఆశీర్వదించి దామోదరను 28183 ఓట్ల భారీ మెజార్టీతో గెలిపించారన్నారు. టేక్మాల్ మండలం 4408 ఓట్ల అత్యధిక మెజార్టీ ఇచ్చి కాంగ్రెస్ పార్టీని ఆదరించారన్నారు. ఈనెల 5న ఉదయం 11లకు మండల కేంద్రం టేక్మాల్‌లో ఆయన పుట్టిన రోజు వేడుకలను నిర్వహిస్తామని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు

కొండపాక(గజ్వేల్): చదువుతోనే సమాజంలో గుర్తింపు పొందుతామని మానవ హక్కుల సంఘం జిల్లా కోఆర్డినేటర్ నందకిషోర్ శర్మ పేర్కొన్నారు. కుకునూరుపల్లి మండల కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో 150 మంది విద్యార్థులకు సోమవారం నోట్ బుక్స్, పెన్నులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని దానాల కంటే విద్యాదానం గొప్పదన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా బాధ్యులు, సత్యసాయి సేవా సంస్థ సభ్యులు ఉప్పల రాజు, ఆర్య వైశ్య మాహాసభ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఉప్పల పాండురంగం, కందూరి వెంకటేశం గుప్త, కాపర్తి రాజు, హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అమరవీరులకు నివాళులు

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద మండల కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. సోమవారం చిన్నశంకరంపేటలోని అమరవీరుల స్తూపం వద్ద కామారం సుభాష్‌రెడ్డి ఆధ్వర్యంలో టాపాసులు కాల్చి సంబురాలు చేశారు. అనంతరం అమరవీరులకు స్తూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు సుభాష్‌రెడ్డి, శ్రీమాన్‌రెడ్డి, రాజిరెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పాలన నుంచి తెలంగాణకు విముక్తి కలిగిందని, ఇప్పుడు తెలంగాణ అమరులకు నిజమైన నివాళి కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ గంగా నరేందర్, మాజీ సర్పంచ్ మైనంపల్లి రంగారావు, శ్రీనివాస్‌రెడ్డి, రామచంద్రం, సాయిలు పాల్గొన్నారు.



అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కార్యకర్తలు అధైర్య పడొద్దు

బీఆర్ఎస్ నాయకుల భరోసా



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): కార్యకర్తలు అధైర్యపడొద్దని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పట్లోరి రాజు, వైస్ ఎంపీపీ సత్యనారాయణగౌడ్ కోరారు. సోమవారం ఈ సందర్భంగా మండల కేంద్రంలో బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో కలిసి మాట్లాడుతూ.. ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని అన్నారు. ప్రజాతీర్పును గౌరవిస్తూ ప్రతిపక్ష పాత్రలో ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు చేస్తామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ కార్యకర్తలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటామని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆర్.అంజిరెడ్డి, లక్ష్మారెడ్డి, సర్పంచ్‌లు పూలపల్లి యాదగిరి, శ్రీనివాస్‌రెడ్డి, దయానంద్, పోచయ్య, లక్ష్మణ్, ఎంపీటీసీ ప్రసాద్‌గౌడ్, మండల నాయకులు సుధాకర్, శ్రీనివాస్, ప్రభాకర్, గొండ స్వామిచంద్రం పాల్గొన్నారు.

కోరం కోసం పడిగాపులు

- ఎట్టకేలకు తూతూ మంత్రంగా మండల సమావేశం పూర్తి



నిరీక్షిస్తున్న ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీడీఓ



ఖాళీగా కుర్చీలు

నర్సాపూర్ రూరల్: ప్రజల సమస్యల కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి ప్రతీ మూడు నెలలకోసారి ఏర్పాటు చేసే మండల సర్వసభ సమావేశానికి కోరం సభ్యులు కరువయ్యారు. సోమవారం నర్సాపూర్ ఎంపీపీ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ జ్యోతి సురేశ్ అధ్యక్షతన నిర్వహించేందుకు ఎంపీడీఓ మార్టిన్ లూథర్ అధికారులతో ఏర్పాట్లు చేశారు. ఈ సమావేశానికి ఉదయం 10 వరకు మండలంలోని 10 మంది ఎంపీటీసీలు, 34 మంది, సర్పంచ్‌లు, 18 శాఖల అధికారులు రావాల్సింది. సమయానికి వైస్ ఎంపీపీ నర్సింగ్ రావు, ఎంపీడీఓ మార్టిన్ లూథర్, ఆరు మంది సర్పంచ్‌లు, ఒక ఎంపీటీ సభ్యురాలు, కొన్ని శాఖల కింది స్థాయి అధికారులు మాత్రమే వచ్చారు. మరికొద్ది సేపటికి ఎంపీపీ, మరో ఐదు మంది సర్పంచ్‌లు వచ్చారు. ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఒక ఎంపీటీసీకి తోడు మరో ఇద్దరు ఎంపీటీసీలు హాజరైతే కనీసం కోరం పూర్తవుతుందని దీంతో సమావేశం ప్రారంభించవచ్చని ఎంపీడీఓ తెలిపారు. కోరంకు కావాల్సిన ఇద్దరు ఎంపీటీసీలు రాలేదు. మూడు గంటల నిరీక్షణ తర్వాత ఇద్దరు ఎంపీటీసీలు రాగ అప్పటికే కొన్ని గంటలు పాటు నిరీక్షించిన సర్పంచ్‌లు, అధికారులు వెళ్లిపోయారు. ఉన్న కొద్ది మందితో తూతూ మంత్రంగా సమావేశం పూర్తి చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని తాగునీరు, విద్యుత్, రోడ్లు, కాల్వల నిర్మాణం, నిర్వహణ ఇతర సమస్యలపై చర్చించాల్సి ఉంటుంది. ప్రజల సమస్యలు తీర్చేందుకు ప్రజలతో ఎన్నుకోబడిన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సర్వసభ్య సమావేశానికి హాజరు కాకపోవడం సర్వ సాధారణంగా మారింది. ఈ విషయమై ఎంపీడీఓ మార్టిన్ లూథర్‌ను వివరణ కోరగా.. మండలంలోని 10 మంది ఎంపీటీసీ సభ్యులు, 34 మంది సర్పంచ్‌లకు మూడు నెలలకు ఒకసారి వారం ముందుగానే ఎజెండా పంపుతామని తెలిపారు. ఆయా కారణాలతో రాలేకపోతున్నట్లు సమాచారం ఇస్తున్నట్లు చెప్పారు.

క్రీడాకారులు ప్రతిభను చాటాలి

గజ్వేల్‌రూరల్: క్రీడాకారులు ప్రతిభను చాటాలని క్రీడాజ్యోతి స్పోర్ట్స్ ఫౌండేషన్ చైర్మన్ ఎంఎస్‌కే హైదర్‌పటేల్ అన్నారు. జగదేవ్‌పూర్ మోడల్ స్కూల్ క్రీడాకారులకు సోమవారం క్రీడాజ్యోతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ డ్రెస్‌లు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాజ్యోతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడల్లో రాణించే వారికి తమవంతు సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈసందర్భంగా రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తున్న క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో జగదేవ్‌పూర్ మోడల్ స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ అనంతరాములు చారి, క్రీడాజ్యోతి స్పోర్ట్స్ ఫౌండేషన్ సెక్రటరీ గోవర్ధన్‌రెడ్డి, సభ్యులు విజయరేఖ, నవీన్, నాగేష్‌కుమార్, క్రీడాకారులు సందీప్, కిరణ్, భాను తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులకు స్పోర్ట్స్ డ్రెస్‌ను అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

బీజేపీ అభ్యర్థి మండలంలో బీఆర్ఎస్ అధిక్యం

నిజాంపేట(మెదక్): మండల కేంద్రానికి చెందిన బీజేపీ అభ్యర్థి పంజా విజయ్ కుమార్ మండలంలో బీఆర్ఎస్‌కు ఎక్కువ మెజార్టీ వచ్చింది. ఈ విషయం మండలంలో ఆశ్చర్యానికి గురి చేసింది. గత ఎన్నికల్లో మండలంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి జెడ్పీటీసీగా పంజా విజయ్ కుమార్ గెలుపొందారు. మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డితో విబేధాలతో ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీ చేరారు. ఈసారి హైకమాండ్‌తో మాట్లాడి మెదక్ బీజేపీ అభ్యర్థిగా విజయ్‌కుమార్ పోటీలో నిలబడ్డారు. తన సొంత మండలంలో ఆయనకు మెజార్టీ వస్తుందని ఆశపెట్టుకున్న అతనికి నిరాశ కనిపించింది.